క్లుప్తంగా

సీసీ రోడ్డు, డ్రెయిన్ల నిర్మాణానికి భూమి పూజ



మాలపాడులో భూమి పూజలో పాల్గొన్న ఎంపీ బోస్, సర్పంచ్ సుజన ప్రియాంక

రామచంద్రపురం రూరల్: మాలపాడు గ్రామంలో సీసీ రోడ్డు, డ్రెయిన్ల నిర్మాణానికి రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్‌చంద్రబోస్ సోమవారం భూమి పూజ నిర్వహించారు. రూ.12.50 లక్షల ఎంపీ నిధులతో ఈ అభివృద్ధి పనులు చేపట్టనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ నేమాల సుజన ప్రియాంక, సంతోష్ దంపతులు, వెల్ల సర్పంచ్ వీరబోయిన సూరిబాబు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పోలినాటి వరప్రసాద్, గ్రామ పెద్దలు గున్నం సూరిబాబు, పందిరి మౌళి, బత్తుల కోదండం, దండంగి సత్యనారాయణ, మడికి శ్రీను పాల్గొన్నారు.

సూర్యప్రకాష్ పరామర్శ



శ్రీనివాస్‌ను పరామర్శిస్తున్న కో ఆర్డినేటర్ సూర్యప్రకాష్

కె.గంగవరం: మండల పరిధిలోని అముజూరు సర్పంచ్ నానాపరపు కల్యాణి భర్త, మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్, మండల మైనార్టీ బీసీ సంఘ అధ్యక్షులు నానాపరపు శ్రీనివాస్‌ను వైఎస్సార్ సీపీ జిల్లా యువజన విభాగ అధ్యక్షులు, రామచంద్రపురం నియోజకవర్గ కోఆర్డినేటర్ పిల్లి సూర్యప్రకాష్ పరామర్శించారు. శ్రీనివాసు ఇటీవల గుండె సంబంధిత ఆపరేషన్ చేయించుకున్న నేపథ్యంలో సూర్యప్రకాష్ ఆయన్ను పరామర్శించి ఆరోగ్య విషయాలు అడిగి తెలుసుకున్నారు. పార్టీ మండల అధ్యక్షుడు పెట్టా శ్రీనివాస్, గ్రామ నాయకులు పెంకే రవిచంద్ర, మేడిశెట్టి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కృత్రిమ అవయవాల ఏర్పాటుకు సహకారం



ప్రమాదవశాత్తూ అవయవాలు కోల్పోయిన వారికి కృత్రిమ కాళ్లు, చేతులు అమర్చిన ప్రతాప్‌కుమార్

కె.గంగవరం: మండల పరిధిలోని పాణింగపల్లికి చెందిన పల్లి ప్రతాప్‌కుమార్ ప్రమాదవశాత్తూ కాలు కోల్పోయిన వారికి కృత్రిమ కాళ్లను ఏర్పాటు చేయడానికి కృషి చేస్తున్నారు. ఇప్పటికే ఇటీవల ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలకు చెందిన అనపర్తి, యానాం, అమలాపురం తదితర ప్రాంతాలకు చెందిన వారికి భారత్ వికాస్ పరిషత్ చారిటబుల్ ట్రస్ట్, లయన్ సౌజన్య సహకారంతో కృత్రిమ కాళ్లు, చేతులు పెట్టించారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిలాల్లో ఎవరైనా సంప్రదిస్తే అవసరమైన వారికి కృత్రిమ అవయవాల ఏర్పాటుకు తన వంతు సహకారం అందజేస్తానని ప్రతాప్ చెప్పారు.

కపిలేశ్వరపురం ఎంపీపీ పదవికి సత్యవేణి రాజీనామా

కపిలేశ్వరపురం: ఎంపీపీ మేడిశెట్టి సత్యవేణి తన పదవికి వ్యక్తిగత కారణాలతో రాజీనామా చేశారు. సోమవారం అమలాపురం కలెక్టరేట్‌లో కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్‌కు ఆమె తన రాజీనామా లేఖను అందజేశారు. తాను ఎంపీపీ పదవికి రాజీనామా చేస్తున్నానని, టేకి గ్రామ ఎంపీటీసీ బాధ్యతలో కొనసాగుతానంటూ లేఖలో పేర్కొన్నారు.

అర్హులందరికీ ఓటు హక్కు

కపిలేశ్వరపురం (మండపేట): అర్హులందరికీ ఓటు హక్కు కల్పించే దిశగా భారత ఎన్నికల సంఘం కృషి చేస్తోందని మండపేట నియోజకవర్గం సహాయ ఓటు నమోదు అధికారి, తహసీల్దార్ పి.తేజేశ్వరరావు అన్నారు. మండపేటలోని తన కార్యాలయంలో సోమవారం మండపేట, రాయవరం, కపిలేశ్వరపురం మండలాల్లోని రెవెన్యూ అధికారులు, గుర్తింపు కలిగిన ప్రధాన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశమై పలు అంశాలపై చర్చించారు. మున్సిపల్ కమిషనర్ టీవీ రంగారావు, ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ పీవీ మెహర్‌బాబా, సీనియర్ అసిస్టెంట్ ఎం.శ్రీనివాసరావు, జూనియర్ అసిస్టెంట్ టి.లక్ష్మణరాజు పలు అంశాలను సూచించారు. వైఎస్సార్ సీపీ ప్రతినిధి యరమాటి వెంకన్నబాబు మాట్లాడుతూ పట్టణంలోని పెద్దకాలువ వంతెన నుంచి రాజారత్న సెంటర్ వరకూ పోలింగ్ బూత్ లేదని, ఆ ప్రాంతంలోని ఓటర్ల కోసం పోలింగ్ బూత్ ఏర్పాటు చేయాలని కోరారు. పలు పార్టీల ప్రతినిధులు జె. వెంకటరమణ, ఎస్‌వీఎస్ ప్రకాష్, ఎంటీ రాజబాబు, ఎం.నాగబాబు పలు సూచనలు చేశారు.

మాలధారణం.. నియమాల తోరణం

- ఆధ్యాత్మిక జీవనానికి భవానీ మాలధారణ దోహదం
- యువతలో పెరుగుతున్న భక్తిభావం
- దసరా సందర్భంగా అమ్మవారికి విశేష పూజలు



భవానీ మాలధారులు



అగ్నిగుండం తొక్కుతున్న భవానీ మాలధారులు (ఫైల్)

రాయవరం: కాళ్లకు పసుపు పారాణి, కాళ్లకు గజ్జెలు, చేతికి ఎర్రటి గాజులు, శరీరంపై ఎరుపు దుస్తులు ధరించిన భవానీ భక్తులు జై భవానీ.. జైజై భవానీ అంటూ భవానీ మాల ధరించిన భక్తుల నినాదాలతో పల్లెలు ఎరుపెక్కుతున్నాయి. ఒక పక్క పంట పొలాలు పచ్చని పైరుతో కళకళలాడుతుంటే మరో పక్క భవానీ దీక్షధారుల ఎరుపు దుస్తులు పచ్చదనంతో పోటీ పడుతున్నట్లుగా ఉంది. భవానీ మాల ధరించిన భక్తులు వేకువజామునే లేచి పూజలు నిర్వహిస్తున్నారు. భవానీ భక్తులు పసుపు, కుంకుమలు, సకల సౌభాగ్యాలను ఇచ్చే పారాణి ధరించి ఆధ్యాత్మిక భావనతో దీక్ష కొనసాగిస్తున్నారు. పిల్లా పాపలు, పాడి పంటలు, పసుపు, కుంకుమలను చల్లగా చూడాలని కోరుతూ అమ్మవారికి తొమ్మిది రోజులు నిత్యపూజలతో మాలధారులు అమ్మవారిని కొలుస్తున్నారు

అరుణవర్ణంగా మారుతున్న పల్లెలు

మాలధారణ చేసిన భవానీ భక్తులు వాడవాడలా ఆశ్రమాలు ఏర్పాటు చేసుకుని అమ్మవారికి పూజలు చేస్తున్నారు. మండపేట, రామచంద్రపురం నియోజకవర్గాల పరిధిలోని మండపేట, కపిలేశ్వరపురం, రాయవరం, రామచంద్రపురం, కె.గంగవరం, కాజులూరు మండలాల్లోని 120 గ్రామాల్లో భవానీ మాలధారులతో దసరా సంబరాలు అంబరాన్నంటుతున్నాయి. భక్తి గీతాలాపనతో భజన చేస్తూ అమ్మవారికి కుంకుమ పూజలు చేస్తున్నారు. చిన్నారుల నుంచి వృద్ధుల వరకు భవానీ మాల ధరించిన భక్తులు వాడవాడలా భవానీ ఆశ్రమాలను ఏర్పాటు చేసుకుని, భక్తిశ్రద్ధలతో, నియమ నిష్ఠలతో అమ్మవారికి శక్తి కొలదీ పూజలు చేస్తున్నారు. భవానీ భక్తులు ఎరుపు రంగు దుస్తులు ధరించడంతో అరుణవర్ణంగా పల్లెలు మారుతున్నాయి.

నియమాలు పాటిస్తూ

అమ్మవారి దీక్షలో ఉన్న భవానీ మాలధారులు పలు నియమాలు పాటిస్తున్నారు. ప్రతీ రోజు ఉదయం దుర్గాదేవిని దర్శించుకుంటున్నారు. దీక్షాపరులు కుంకుమ రంగు వస్త్రాలను ధరించి, మద్యం, మాంసం, ధూమపానం తదితర దురలవాట్లకు దూరంగా ఉంటూ భక్తిశ్రద్ధలతో అమ్మవారిని కొలుస్తున్నారు. పగటిపూట భోజనం, రాత్రి సమయంలో అల్పాహారం తీసుకుంటున్నారు.

పెరిగిన భవానీ భక్తులు

ఈ ఏడాది భవానీ భక్తుల సంఖ్య బాగా పెరిగింది. భవానీ మాల ధారణ చేసిన భక్తుల సంఖ్య ఏటేటా పెరుగుతోంది. ఈ ఏడాది అధిక సంఖ్యలో యువతతో పాటు, మహిళలు మాల ధారణ చేయడం విశేషం. భవానీ మాలధారణ చేసిన భక్తులు గ్రామాల్లో ప్రత్యేక పూజలు, భజనలు చేస్తూ దసరా ఉత్సవాలకు మరింత సందడిని తీసుకొస్తున్నారు. పలు చోట్ల భవానీ భక్తులు అగ్నిగుండాలు తొక్కుతూ తమ భక్తిప్రపత్తులను చాటేందుకు సిద్ధమవుతున్నారు.

పాద రక్షలు లేకుండా, క్షరకర్మ చేయకుండా, మనసా, వాచా, కర్మణా బ్రహ్మచర్యం పాటిస్తూ..జై భవానీ, జై శక్తి అంటూ అమ్మవారి నామస్మరణ చేస్తున్నారు. కఠినమైన నియమాలు పాటిస్తూ అమ్మవారిని కొలిచే భక్తులతో పల్లెలు కళకళలాడుతున్నాయి.

30వ సారి దీక్ష తీసుకున్నా



అమ్మవారిపై నమ్మకంతోనే 30వ సారి దీక్ష తీసుకున్నాను. అమ్మవారి దీక్ష కారణంగా మంచి జరుగుతుందనే విశ్వాసం ఉంది. నవరాత్రులు తొమ్మిది రోజులు కఠినమైన దీక్షను చేపడతాను. దీక్షలో శక్తిదాయిని అయిన అమ్మవారిని నిత్యం స్మరించడంతో నూతనోత్సాహం కలుగుతుంది.

– గుడాల సూరిబాబు, గురు భవానీ, రాయవరం

అమ్మవారి కరుణా కటాక్షాలు



భగవంతునిపై భక్తి భావం, ఆధ్యాత్మిక ప్రపత్తులు కలిగి ఉండడం ప్రతి ఒక్కరికీ అవసరం. పవిత్రతో దీక్షలు అనుసరిస్తే అమ్మవారి కరుణా కటాక్షాలు లభిస్తాయి. దుర్గాదేవి దీక్షలో ఉంటే గొప్ప అనుభూతి కలుగుతుంది. మనసుకు ప్రశాంతత లభిస్తుంది.

– తోట దివ్యశ్రీ,, భవానీ మాలధారురాలు, రాయవరం

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

కాజులూరు: కాజులూరు 33/11 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని పలు గ్రామాలకు మంగళవారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు కాకినాడ ఏపీ ఈపీడీసీఎల్ డీఈ ఎస్ ఉదయ్‌భాస్కర్ తెలిపారు. సోమవారం గొల్లపాలెం మెయిన్ సబ్‌స్టేషన్ ఏఈ వీర్రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కుయ్యేరు 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ నుంచి మండల కేంద్రమైన కాజులూరుకు కొత్త విద్యుత్ లైన్ నిర్మాణం పనులు చేపట్టామన్నారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ కాజులూరు సబ్‌స్టేషన్ పరిధిలోని అయితపూడి, తిప్పరాజుపాలెం, కాజులూరు, కాజులూరు శివారు గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామన్నారు.

దాడికి పాల్పడిన వారిపై హత్యాయత్నం కేసు నమోదు



ఘటనా స్థలంలో క్లూస్ టీం పరిశీలన

రాయవరం: ముత్యాలమ్మ తల్లి ఆలయ షెడ్డు నిర్మిస్తున్న వారిపై రాళ్లతో దాడికి పాల్పడిన వ్యక్తులపై హత్యాయత్నం కేసు నమోదు చేసినట్లు రాయవరం ఎస్సై డి.సురేష్‌బాబు తెలిపారు. షెడ్డు నిర్మాణం వద్ద రాళ్ల దాడికి గాయపడి చికిత్స పొందుతూ బోదంకి సత్యనారాయణ(సత్తిబాబు) రామచంద్రపురం ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందగా పలువురు మహిళలు గాయపడిన విషయం తెలిసిందే. కమిటీ సభ్యులపై రాళ్లతో దాడి చేసిన ఘటనలో మృతుని భార్య వెంకటలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు రేలంగి నాగేశ్వరరావు, రమణ అనే మహిళ పై వివిధ సెక్షన్లతో హత్యాయత్నం కేసు నమోదు చేశామన్నారు. మండపేట రూరల్ సీఐ పీతల దొర రాజు పర్యవేక్షణలో ముత్యాలమ్మ గుడి వద్ద క్లూస్ టీం బృందం పరిశీలించింది.

సంఘటిత కృషితోనే సమస్యల పరిష్కారం



బీసీ సామాజిక భవనం ప్రారంభోత్సవ పూజలో పాల్గొన్న ఎంపీ పిల్లి సుభాష్‌చంద్రబోస్, సూర్యప్రకాశ్

కాజులూరు: సంఘటిత కృషితోనే సమస్యలు పరిష్కారమవుతాయని రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్‌చంద్రబోస్ అన్నారు. కాజులూరు శివారు చాకిరేవు మెరకలో ఎంపీ లాడ్స్, జిల్లా పరిషత్, మండల పరిషత్ సంయుక్త నిధులు రూ.25 లక్షల వ్యయంతో నిర్మించిన బీసీ సామాజిక భవనానికి సోమవారం ఎంపీ పిల్లి సుభాష్‌చంద్రబోస్, రామచంద్రపురం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్ పిల్లి సూర్యప్రకాశ్ పూజలు చేసి ప్రారంభోత్సవం చేసారు. బీసీ సామాజిక భవనాన్ని అన్ని వర్గాల వారు ఐక్యతతో వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ వనుం వెంకటసుబ్బారావు, ఎంపీపీ మాత భారతి, మండల పార్టీ అధ్యక్షుడు పిల్లి కృష్ణమూర్తి, సర్పంచ్ దండంగి సరోజిని పాల్గొన్నారు.

ప్రతి కార్యకర్తకూ అండగా నిలుస్తాం

వైఎస్సార్ సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు సూర్యప్రకాశ్



వైఎస్సార్ సీపీ డిజిటల్ బుక్ క్యూఆర్ కోడ్‌ను ఆవిష్కరిస్తున్న కో ఆర్డినేటర్ సూర్యప్రకాశ్

రామచంద్రపురం: పార్టీ అభ్యున్నతికి పనిచేస్తూ, కూటమి ప్రభుత్వం చేస్తున్న దుష్పాలనపై ఎదురునిలిచిన ప్రతి కార్యకర్తకు వైఎస్సార్ సీపీ అండగా ఉంటుందని, పార్టీ ప్రత్యేకంగా రూపొందించిన డిజిటల్ బుక్ ద్వారా ఎప్పటికప్పుడు ప్రజలకు జరుగుతున్న అన్యాయాన్ని తెలియజేయాలని వైఎస్సార్ సీపీ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు, నియోజకవర్గ పార్టీ కోఆర్డినేటర్ పిల్లి సూర్యప్రకాశ్ అన్నారు. పట్టణంలోని గాంధీపేటలోని కార్యాలయంలో పార్టీ ప్రత్యేకంగా రూపొందించిన డిజిటల్ బుక్ క్యూర్ కోడ్‌ను ఆయన నేతలతో కలిసి సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సూర్యప్రకాశ్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం 13 నెలల పాలనలో జరిగిన వైఫల్యాలను ఎండగట్టారు. ఎన్నికల సమయంలో సూపర్ సిక్స్ అంటూ ఊదర కొట్టిన కూటమి నేతలు వాటిని పూర్తిస్థాయిలో అమలు చేయకుండానే సూపర్ హిట్ అంటూ డబ్బాలు కొట్టుకుంటున్నారని విమర్శించారు. ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు ఎన్నడూ లేని విధంగా విజయోత్సవ సభలు నిర్వహించుకోవటం సిగ్గుచేటన్నారు. ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తి చూపుతుంటే వైఎస్సార్ సీపీ నేతలపై తప్పుడు కేసులు పెడుతూ కక్ష సాధింపు చర్యలు పాల్పడుతోందని సూర్యప్రకాశ్ అన్నారు. ప్రభుత్వం చేస్తున్న దుర్మార్గపు పాలనను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని కార్యకర్తలకు సూచించారు. జెడ్పీటీసీ సభ్యుడు వనుం వెంకట సుబ్బారావు, ఎంపీపీలు అంబటి భవానీ, మాతా భవానీ, వైస్ ఎంపీపీ శాఖా బాబీ, పార్టీ నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు యర్రమిల్లి సతీష్‌కుమారి, మండల కన్వీనర్లు పిల్లి కృష్ణమూర్తి, పోలినాటి వరప్రసాద్, పార్టీ నేతలు సత్తి శంకర్‌రెడ్డి, చిట్టూరి శ్రీను, గోవిందరాజు పాల్గొన్నారు.

నిలకడగా వరద గోదారి



కోటిపల్లిరేవు వద్ద వరద గోదారి

కె.గంగవరం: తాజాగా ఇటీవల ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాలకు ధవళేశ్వరం కాటన్ బ్యారేజీకు భారీగా వరదనీరు చేరుతోంది. కాటన్ బ్యారేజ్ నుంచి సముద్రంలోకి నీటిని వదలడం వల్ల కోటిపల్లిలో వరద ఉధృతి నెల వ్యవధిలో నాల్గవ సారి పెరిగింది. సోమవారం ఉదయం రెండు అడుగులు మేర పెరిగిన గోదావరి సాయంత్రం వరకు నిలకడగా ఉందని స్థానికులు చెబుతున్నారు. మరో రెండు అడుగులు మేర ఉధృతి పెరిగితే కోటిపల్లిలోని మాధవనగర్, హరినారాయణవారి వీధి, నూకాలమ్మ పేట వరద నీటిలో చిక్కుకోనున్నాయి. గోదావరి ఒడ్డునే ఉన్న పాకలలోకి వరదనీరు చేరింది. వరద కారణంగా లంకల్లోని పశువులను రైతులు గట్టుకు చేర్చారు. పశువులకు ఆహారం లేక అలమటిస్తున్నాయని పాడి రైతులు వాపోతున్నారు. లంకలతో పాటు గోదావరి ఒడ్డున ఉన్న ఉద్యాన పంటలు నీటమునిగాయి. కొబ్బరి, అరటి, మిర్చితో పాటు పలు రకాల కురగాయల తోటలు మునగడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. మరో రెండు రోజుల పాటు వరద ఉధృతి కొనసాగుతుందని రెవెన్యూ శాఖ సిబ్బంది చెబుతున్నారు. గోదావరి వరదను చూసేందుకు చుట్టు పక్కల గ్రామాల సందర్శకులతో కోటిపల్లి రేవు కిటకిటలాడింది.

మహిళల ఆరోగ్యంతో కుటుంబం పురోగతి



అముజూరు వైద్య శిబిరంలో మహిళలకు సూచనలిస్తున్న వైద్య సిబ్బంది

కాజులూరు: గృహిణి ఆరోగ్యంగా ఉంటేనే ఆ కుటుంబంలో సంతోషాలు వెల్లివిరిస్తూ పురోగతి సాధ్యమవుతుందని బందనపూడి సర్పంచ్ డేగల తిరుమలవేణి అన్నారు. బందనపూడి సచివాలయ ఆవరణలో సోమవారం గొల్లపాలెం పీహెచ్‌సీ వైద్యాధికారులు స్వస్థ్ నారీ- సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమం నిర్వహించి 126 మందికి వైద్యసేవలు అందించారు. రోగులకు సర్పంచ్ డేగల తిరుమలవేణి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఎంపీటీసీ సలాది లక్ష్మణరావు, ఉప సర్పంచ్ నల్లమిల్లి బుల్లివెంకటరెడ్డి, పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

మహిళలు ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవాలి

కె.గంగవరం: మహిళలు తమ ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవాలని పామర్రు వైద్య సిబ్బంది ప్రకాష్ అన్నారు. అముజూరులో సోమవారం స్వస్థ్ నారీ- సశక్తి పరివార్ అభియన్‌లో భాగంగా ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. మహిళలకు వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. బీజేపీ నాయకులు కర్రి చిట్టిబాబు, ఏవీ రమణమూర్తి, చిన్నికృష్ణ, పంచాయతీ కార్యదర్శి దుర్గాప్రసాద్, ఏఎన్‌యంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

కపిలేశ్వరపురం: కేంద్ర ప్రభుత్వం మహిళల ఆరోగ్య రక్షణకై ప్రత్యేక శ్రద్ధ వహిస్తోందని జిల్లా మలేరియా అధికారి నక్కా వెంకటేశ్వరరావు తెలిపారు. పడమర ఖండ్రిక సర్పంచ్ తిరునాతి ఆదిలక్ష్మి అధ్యక్షతన సోమవారం ప్రత్యేక వైద్య శిబిరాన్ని నిర్వహించారు. పీహెచ్‌సీ వైద్యాధికారిణి పీఎస్ఎస్‌డీ రత్నకుమారి మహిళా ఆరోగ్య రక్షణపై అవగాహన కల్పించారు. ఎంపీటీసీ సభ్యురాలు పెద్దిరెడ్డి శేషారత్నం, ఎంపీహెచ్‌ఈఓ జిత్తుక మల్లికార్జునుడు, డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ అధికారి బి.రామారావు, నాయకులు హెల్త్ విజిటర్ తాతపూడి మేరీమణి, ఎంపీహెచ్ఎస్ ఎం.నానిబాబు పాల్గొన్నారు.

తాళ్లపొలంలో..

రామచంద్రపురం రూరల్: తాళ్లపొలంలో వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో సోమవారం స్వస్థ్ నారీ- సశక్త్ పరివార్ కార్యక్రమం నిర్వహించారు. ఉట్రుమిల్లి సర్పంచ్ అయ్యల అమ్మాజీ, తాళ్లపొలం ఉప సర్పంచ్ వల్లు శివ, ఎంపీటీసీ పంపన ఏడుకొండలు వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఆయుష్ వైద్యురాలు డాక్టర్ ప్రతిభ, సీహెచ్‌ఓ వీరవేణి, పీహెచ్‌ఎన్ జానకమ్మ, హెచ్‌వీ వరలక్ష్మి వైద్య సేవలు అందించారు.

పార్టీలకు అతీతంగా అభివృద్ధి, సంక్షేమం




కౌన్సిల్ సమావేశంలో మంత్రి సుభాష్, చైర్ పర్సన్ సుభాష్

రామచంద్రపురం: నియోజవర్గం వెల్లలోని జగనన్న లే అవుట్లపై వస్తున్న ఫిర్యాదులపై, జరిగిన అవినీతిపై విచారణ చేపట్టి, దోషులపై క్రిమినల్ కేసులు పెడతామని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ పేర్కొన్నారు. మున్సిపల్ చైర్ పర్సన్ గాదంశెట్టి శ్రీదేవి అధ్యక్షతన కౌన్సిల్ సాధారణ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మంత్రి సుభాష్ పాల్గొని మాట్లాడారు. 3వ కౌన్సిలర్ అంకం శ్రీనివాస్ మాట్లాడుతూ జగనన్న లే అవుట్‌లో రుణాల మంజూరులో, స్థల కేటాయింపులో అవినీతి జరిగిందని ఆరోపించారు. ఈ సందర్భంగా మంత్రి సుభాష్ మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమ విషయంలో పార్టీలకు అతీతంగా ప్రభుత్వ ఫలాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ దక్కేలా చూస్తున్నామన్నారు. కమిషనర్ రాజు, గృహ నిర్మాణ శాఖ డీఈలు సుంకర రాంబాబు, శ్రీకాంత్, ఇతర అధికారులు, వార్డు కౌన్సిలర్లు పలు అభివృద్ధి కార్యక్రమాలపై చర్చించారు. తొలుత సాధారణ సమావేశంలో మొత్తం 14, అత్యవసర సమావేశంలో 12 అంశాలను ప్రవేశపెట్టారు. అన్ని అంశాలను సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు. వైస్ చైర్మన్లు చింతపల్లి నాగేశ్వరరావు, కోలమూరి శివాజీ, కౌన్సిల్ విప్ వాడ్రేవు సాయిప్రసాద్, కౌన్సిలర్‌లు, అధికారులు పాల్గొన్నారు.

వైభవంగా శరన్నవరాత్ర పూజలు



మండపేటలో సరస్వతీ పూజలో పాల్గొన్న పతివాడ నూక దుర్గారాణి



మండపేట గొల్లపుంతలో సరస్వతీ పూజ చేస్తున్న చిన్నారులు



అముజూరులో సామూహిక సరస్వతీ పూజలో చిన్నారులు

కపిలేశ్వరపురం (మండపేట): నియోజకవర్గంలోని మండపేట పట్టణం, రూరల్, రాయవరం, కపిలేశ్వరపురం మండలాల్లోని గ్రామాల్లో సోమవారం శరన్నవరాత్ర ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మండపేట పట్టణం 15, 26వ వార్డుల్లో, కలువపువ్వు సెంటర్‌లోని ఆలయాల్లో నిర్వహించిన పూజల్లో మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ నూక దుర్గారాణి పాల్గొన్నారు. కౌన్సిలర్ నీలం దుర్గ, గ్రంథి శ్రీనివాసు, నాయకులు పెంకే గంగాధరం పాల్గొన్నారు. కపిలేశ్వరపురం మండలం అంగరలోని పల్లపువీధిలోని మండపంలో సరస్వతీ పూజ చేశారు.

గొల్లపుంత కాలనీలో ..

మండపేట పట్టణం గొల్లపుంత కాలనీలో దేవీ కమిటీ ఆధ్వర్యంలో 15వ శరన్నవరాత్ర శిబిరంలో సరస్వతీ పూజలు చేశారు. అనంతరం కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో చిన్నారులకు పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. భక్తులు అమ్మవారి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.

ఘనంగా సరస్వతీ పూజలు

కాజులూరు: మండలంలోని దుర్గాదేవి ఆలయాల్లో సోమవారం మూలానక్షత్రం ప్రారంభంకావడంతో సరస్వతీ పూజలు ఘనంగా నిర్వహించారు. అమ్మవారిని సరస్వతీరూపంలో అలంకరించి చిన్నారులతో పూజలు నిర్వహించారు. కాజులూరు, ఆర్యావటం, మొగలిపాలెం, శీల, గొల్లపాలెం, కుయ్యేరు, కోలంకలో సరస్వతీ పూజలు నిర్వహించారు. గొల్లపాలెం జిల్లా పరిషత్ హైస్కూల్లోని సరస్వతీ మందిరంలో స్థానిక నాయకుడు కడలి రాంపండు ఆధ్వర్యంలో చిన్నారులకు అక్షరాభ్యాసాలు నిర్వహించారు.

అమ్మవార్లకు పూజలు

రాయవరం: మూలా నక్షత్రం సందర్భంగా పార్వతీ సమేత రాజేశ్వరస్వామి ఆలయం, సోమేశ్వరం శ్రీబాలాత్రిపుర సుందరీ సమేత సోమేశ్వరస్వామి ఆలయం , వెంటూరులోని పార్వతి సమేత సోమేశ్వరస్వామి ఆలయంలో సరస్వతీ పూజలు చిన్నారులతో చేయించారు. రాయవరంలోని పార్వతి సమేత రాజేశ్వరస్వామి, చెల్లూరులోని అగస్త్యేశ్వరస్వామి, సోమేశ్వరంలోని బాలాత్రిపుర సుందరీ సమేత సోమేశ్వరస్వామి, వెంటూరులోని ఉమా సమేత సోమేశ్వరస్వామి, పసలపూడిలోని శివాలయంలో నిర్వహించిన సరస్వతీ పూజల్లో చిన్నారులు పాల్గొని పూజలు చేశారు.

సామూహిక పూజలు

కె.గంగవరం: మండల పరిధిలోని పలు గ్రామాల్లోని కనకదుర్గా దేవి మండపాల వద్ద సోమవారం చిన్నారులతో సామూహిక సరస్వతీ పూజలు నిర్వహించారు. అముజూరులోని గొల్లలమ్మ గుడి వీధిలోని కనకదుర్గ ఆలయం వద్ద సరస్వతీ పూజలో పాల్గొన్న చిన్నారులకు కోడూరి ప్రసాద్ పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. సత్యవాడలో అమ్మవారు సరస్వతీ దేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు.

వీణాపాణీ నమోస్తుతే

రామచంద్రపురం రూరల్: ద్రాక్షారామ మాణిక్యాంబ సమేత భీమేశ్వరస్వామి ఆలయంలో దసరా మహోత్సవాల్లో భాగంగా 8వ రోజు సోమవారం మాణిక్యాంబ అమ్మవారి మట్టి ప్రతిమకు సరస్వతీ దేవిగా అలంకరించారు. ఆలయ ఈఓ, దేవదాయ శాఖ జిల్లా సహాయ కమిషనర్ అల్లు వెంకటదుర్గాభవాని ఆధ్వర్యంలో లక్ష కుంకుమార్చన నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



సరస్వతీదేవి అలంకరణలో ద్రాక్షారామ మాణిక్యాంబ అమ్మవారు



రాయవరం దుర్గమ్మ ఆలయం వద్ద సరస్వతీ పూజల్లో చిన్నారులు

ద్రాక్షారామ కన్యకా పరమేశ్వరి ఆలయంలో పూజలు

రామచంద్రపురం రూరల్: ద్రాక్షారామ వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో వారణాసి కార్తికేయ బ్రహ్మత్వంలో సరస్వతీ దేవి అవతారంలో కన్యకా పరమేశ్వరి అమ్మవారిని అలరించి సామూహిక సరస్వతీ పూజలు నిర్వహించారు. ఆదివారపుపేట శివ బాలయోగి మహారాజ్ ఆశ్రమంలో పార్వతి అమ్మవారు సరస్వతీ దేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు.